ఆర్ట్స్ కాలేజీకి నూతన శోభ

● 85 ఏళ్ల చారిత్రక కట్టడానికి తొలిసారిగా రంగులు ● రూ.5.90 కోట్ల హెచ్‌ఎండీఏ నిధులతో మరమ్మతులు



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ భవనానికి మహర్దశ ప్రారంభమైంది. 85 ఏండ్ల చారిత్రక రాతికట్టడానికి నూతన రంగులు అద్దుతున్నారు. రూ.5.90 కోట్ల హెచ్‌ఎండీఏ నిధులతో కళాశాల భవనానికి మరమ్మతులు చేపట్టి రంగులు వేయనున్నారు. ఆర్ట్స్ కాలేజీ భవన నిర్మాణం 1939లో నిర్మించంగా 85 ఏళ్ల తరువాత రూ.5.90 కోట్లతో మరమ్మతులు చేపట్టడం విశేషం. ఇంత పెద్ద మొత్తంలో మరమ్మతులు పనులు చేపట్టడం ఓయూ చరిత్రలో ఇదే ప్రథమం. రాతి కట్టడం కావడం వలన భవనం వెలుపల భాగం గోడలు 85 సంవత్సరాలు గడిచినా తాజాగా నిర్మించినట్లు ఉన్నాయి. కానీ లోపల భాగం గోడలు పాడయ్యాయి. భవనం లోపల గోడలకు ఆరు నెలలుగా సాగుతున్న మరమ్మతు పనులు చివరి దశకు చేరుకున్నాయి. రంగుల వేసే పనులను ఏషియన్ పెయింట్స్ సంస్థకు అప్పగించారు. ఇదిలా ఉండగా రెండు సంవత్సరాల క్రితం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి రూ.13 కోట్ల వ్యయంతో ఓయూ చరిత్ర తెలిపే లేజర్ షోను ఆర్ట్స్ కాలేజీ భవనం ముందు భాగాన ప్రదర్శించేందుకు ఏర్పాటు చేశారు.

ఉర్సు ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీక



రసూల్‌పురా: ఉర్సు ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీకలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి అన్నారు. కంటోన్మెంట్‌లో రసూల్‌పురా గన్‌బజార్ ఉర్సు ఈ షరీఫ్ హజ్రత్ గరీబ్‌షా దర్గా ఉర్సు కార్యక్రమంలో రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్‌తో కలిసి కేశవరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్గాలో ఛాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో అశోక్. జబ్బార్, ఎంఐఎం నాయకులు ముఖ్రిమ్, దర్గా నిర్వాహకులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీని ప్రకటిస్తున్న నాయకులు

రసూల్‌పురా: అధికార కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి వారిని చైతన్య పరిచేందుకు వార్డు స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేసేందుకు కమిటీలను నియమిస్తున్నట్లు మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి బీఎస్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం కంటోన్మెంట్ నియోజకవర్గం మూడవ వార్డు పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో నూతన కమిటీని పార్టీ కార్యవర్గసభ్యులు మాచర్ల శ్రీనివాస్ సమక్షంలో ఎన్నుకున్నారు. వార్డు అధ్యక్షులుగా అరుణ్, ఉపాధ్యక్షులుగా రవిచంద్రన్, చంద్రశేఖర్, ఏ. స్వాతి. సాంబ అశోక్, ప్రధాన కార్యదర్శిగా మధు కొమ్ముల, హరిక్రిష్ణ, కార్యదర్శులుగా సునీత, రోషన్, భువనేశ్వరి, రకీం దీపలను నియమించారు.

సెట్విన్ కార్యకలాపాలను మరింత విస్తరిస్తాం



సెట్విన్ భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలోని సెట్విన్ శిక్షణ కేంద్రం కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని సికింద్రాబాద్ శాసనసభ్యుడు తీగుళ్ల పద్మారావు గౌడ్ తెలిపారు. శనివారం సెట్విన్ శిక్షణ కేంద్రంపై నిర్మిస్తున్న అదనపు అంతస్తుల నిర్మాణం పనులను ఆయన పరిశీలించారు. కొత్తగా చేపట్టిన పై అంతస్తుల నిర్మాణం పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో సెట్విన్ ట్రైనింగ్ సెంటర్ ఇంచార్జ్ అనిత, ఇతర అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ



కంటోన్మెంట్: పేదలకు సేవ చేయాలన్న తలంపుతో పదేళ్ల క్రితం తాను నెలకొల్పిన శ్రీగణేశ్ ఫౌండేషన్ (ఎస్‌జీఎఫ్) సేవలు నిరంతరంగా కొనసాగుతాయని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో పేద పిల్లలకు ఉచితంగా స్కూలు బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్‌లు, ఉపాధి కల్పన కోర్సుల్లో బోధన, ప్రతి వేసవిలో చలివేంద్రాల ఏర్పాటు, పేద విద్యార్థులకు స్కూలు బ్యాగులు, పుస్తకాల పంపిణీ వంటివి చేపడుతూ వచ్చామన్నారు.

ఉత్సాహంగా షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు

లాలాపేట: శనివారం లాలాపేటలోని ప్రొ జయశంకర్ ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ ఇంటర్ స్టేడియం టోర్నమెంట్స్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. సబ్ జూనియర్స్ బాయ్స్ సింగిల్స్ విభాగంలో శతక్ష విజేతగా, జీవన్‌రాజ్ జైన్ రన్నర్‌గా నిలిచారు. విజేతలకు జూన్ 5న బహుమతులు అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు.

ఎమ్మెల్యేను ఆపిన మురుగు పరుగు

అధికారులను పరుగులు పెట్టించిన ఎమ్మెల్యే



జలమండలి ఎండీతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: మోండా డివిజన్ అంబేద్కర్‌నగర్‌లో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు బయలుదేరిన ఎమ్మెల్యే శ్రీగణేశ్, మారేడుపల్లి టీచర్స్ కాలనీ– అంబేద్కర్ నగర్ బస్తీల మధ్య రోడ్డుపై పారుతున్న మురుగును చూసి అక్కడికక్కడే ఆగిపోయారు. మురుగు పారుతున్న ప్రాంతాన్ని పరిశీలించి, స్థానికులతో మాట్లాడారు. ఆరు నెలలుగా ఇది నిత్యకృతం అయిందని స్థానికులు ఆయనకు విన్నవించారు. ప్రతీసారి ఫిర్యాదు చేసినప్పుడు సిబ్బంది వచ్చి తాత్కాలిక పనులు చేపట్టడం, మళ్లీ మురుగు రోడ్డుపై పారడం పరిపాటిగా మారిందని వివరించారు. దీంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నేరుగా జలమండలి ఎండీ అశోక్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. వీడియో కాల్ ద్వారా ఇక్కడి దుస్థితిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ఆదేశాల మేరకు సికింద్రాబాద్ సర్కిల్ జనరల్ మేనేజర్ వినోద్ తన సిబ్బందితో పది నిమిషాల్లో అక్కడికి చేరుకున్నారు. గతంలో ఈ మార్గంలో కొత్తగా వేసిన రోడ్డు పనుల కారణంగా, డ్రైనేజీ లైను దెబ్బతిన్నట్లుగా ఎమ్మెల్యేకు వివరించారు. నూతన డ్రైనేజీ లైను కోసం ప్రతిపాదనలు రూపొందించామని, త్వరలోనే పనులు చేపడతామన్నారు.

స్థానిక సమస్యలు పరిష్కరించండి



ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న కాంగ్రెస్ నేత కోట నీలిమ

సనత్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కారానికై టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట నీలిమ వివిధ శాఖల అధికారులతో కలిసి శనివారం సనత్‌నగర్ అల్లావుద్దీన్ కోఠిలో పర్యటించారు. ఈ సందర్భంగా మంచినీటి సరఫరా, విద్యుత్ సరఫరా, రహదారుల పరిస్థితి, పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలను అక్కడే ఉన్న జీహెచ్‌ఎంసీ, టీజీఎస్‌పీడీసీఎల్, హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారులకు వివరించి పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా కోట నీలిమ మాట్లాడుతూ సమర్థవంతమైన పరిపాలనకు ప్రజల భాగస్వామ్యం కూడా అవసరమన్నారు. ఏఎంఓహెచ్ చంద్రశేఖర్, ఏఈ జమీల్, శానిటేషన్ ఆఫీసర్ అరవింద్, టీజీఎస్‌పీడీసీఎల్ ఏఈ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీలో స్పోర్ట్స్ కోటాను అమలుచేయండి


ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాల భర్తీలో పలు క్రీడాలను స్పోర్ట్స్ కోటాలో చేర్చి అమలు చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డికి ఓయూ వ్యాయామ విద్య విద్యార్థులు శనివారం వినతి పత్రం అందచేశారు. జీఓ నంబరు 74లో మార్పులు చేసి జీఓ నం.2ను ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటాను వర్తింప చేయాలని విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యాయామ విద్య పీజీ విద్యార్థులు ఎర్ర. భూపాల్, శ్రవణ్, సిద్ధు, ప్రభాకర్, శివానంద్, ప్రభాస్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రేషన్ పంపిణీ

రాంగోపాల్‌పేట్: వర్షాకాలం నేపథ్యంలో జూన్ 1వ తేదీ నుంచి ముందస్తుగా 3 నెలల రేషన్ పంపిణీ చేస్తున్నట్లు సర్కిల్–8 పౌరసరఫరాల శాఖ ఏఎస్‌వో కృష్ణవేణి తెలిపారు. లబ్ధిదారులు రేషన్ దుకాణాల నుంచి రేషన్ పొందవచ్చని ఆమె తెలిపారు. జూన్, జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన బియ్యం, గోధుమలు, చక్కెర పంపిణీ చేస్తామని తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు రేషన్ పంపిణీ చేస్తున్నామని ఈ పాటికే రేషన్ డీలర్ల సమావేశాన్ని నిర్వహించినట్లు ఆమె చెప్పారు. సరఫరా సమయంలో ఏమైనా సాంకేతిక సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. తమ సర్కిల్ పరిధిలో 69,908 కార్డులు, 67 మంది రేషన్ డీలర్లు ఉన్నారని తెలిపారు. కొత్త రేషన్ కార్డుల కోసం ఇప్పటి వరకు 7339 మంది దరఖాస్తులు చేసుకోగా 4161 దరఖాస్తులు పరిశీలించామని చెప్పారు.

గురుకుల కార్యదర్శిని సస్పెండ్ చేయాలి

ఉస్మానియా యూనిర్సిటీ: విద్యార్థులు శానిటేషన్ పనులు చేస్తే తప్పేంటని వ్యాఖ్యానించిన గురుకుల కార్యదర్శి అలుగు వర్షిణిని తక్షణం సస్పెండ్ చేయాలని సామాజిక విప్లవకారుడు డాక్టర్ ప్రేమ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట విలేకరులతో మాట్లాడుతూ దేశంలోనే అత్యున్నతమైన ఐఏఎస్ విద్యను అభ్యసించి ఉన్నత పదవిలో కొనసాగున్న ఆమె మానవత్వం లేకుండా మాట్లాడటం దారుణమన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేయనున్నట్లు హెచ్చరించారు.



రవీందర్‌రెడ్డికి నివాళి

రాంగోపాల్‌పేట్: గత కొంత కాలంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించిన తన వ్యక్తిగత సహాయకులు రవీందర్‌రెడ్డికి మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి నివాళులు అర్పించారు. శనివారం రవీందర్‌రెడ్డి నివాసంలో కుటుంబ సభ్యులను కలిసి ఓదార్చడంతో పాటు వారికి ధైర్యాన్ని చెప్పారు. అనంతరం ఆయనకు నివాళులు అర్పించారు.

ఓయూ అడిషనల్ చీఫ్ వార్డెన్‌గా డా.మేడి శ్రీనివాస్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ హాస్టల్స్, మెస్సుల అడిషనల్ చీఫ్ వార్డెన్‌గా డా.మేడి శ్రీనివాస్ నియమితులయ్యారు. బయో మెడిసిన్ ఇంజినీరింగ్ విభాగం అధ్యాపకులుగా పని చేస్తున్న ఆయన గతంలో పరీక్షల విభాగం అసిస్టెంట్ చీఫ్ సూపరింటెండెంట్‌గా, బీఎంఈ విభాగం బీఓఎస్ చైర్మన్‌గా, హాస్టల్ మెస్ వార్డెన్‌గా విద్యార్థులకు సేవలందించారు. డా.మేడి శ్రీనివాస్‌ను వీసీ ప్రొ.కుమార్, ప్రిన్సిపల్ ప్రొ.చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపల్ ప్రొ.మంగు అభినందించారు.

టీజీపీసీబీ జేసీఈ సైంటిస్ట్ పదవీ విరమణ

సనత్‌నగర్: తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ సైంటిస్ట్ డాక్టర్ ఎం.సత్యనారాయణరావు శనివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా సనత్‌నగర్‌లోని పీసీబీలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సభ్య కార్యదర్శి రవి మాట్లాడుతూ సత్యనారాయణరావు చేసిన సేవలను కొనియాడారు. ఆయన రిటైర్‌మెంట్ జీవితం సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ రఘు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం బోనాల కాంప్లెక్స్‌లో పేకాట ఆడుతున్న వారిని ఎస్ఆర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. బోనాల కాంప్లెక్స్ ఎఫ్–9లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో శనివారం పోలీసులు సోదాలు నిర్వహించి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. జుబ్లీహిల్స్ కృష్ణానగర్‌కు చెందిన ఫోటో గ్రాఫర్ బొడ్డు శ్రీను, ఈసీఐఎల్‌కు చెందిన హోటల్ వ్యాపారి ఎం. సాయికుమార్‌తో పాటు రఘు,కిరణ్ అనే వ్యక్తులను అరెస్టు చేశారు.

కూరగాయల ధరలు..

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో రూపాయల్లో..) టమాటా.15, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 47, పచ్చకాకర 38, పందిరి బీర 50, క్యాబేజీ 13, క్యారెట్ 35, దొండ 15, గుండుబీన్స్ 105, గింజ చిక్కుడు 65, గోకరకాయ 35, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 16, ఆలుగడ్డ 25, చామగడ్డ 28, మొరంగడ్డ 18, కందగడ్డ 50, సొరకాయ 9, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 5–6. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

'మాది చేతల ప్రభుత్వం'



కంటోన్మెంట్: మాది చేతల ప్రభుత్వం అని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. బోయిన్‌పల్లిలోని రామన్నకుంట సుందరీకరణ అంటూ గత పాలకులు ఏళ్ల తరబడి ప్రకటనలకే పరిమితం అయ్యారని, తాము ఆ పని చేసి చూపిస్తామన్నారు. శనివారం హెచ్ఎండీఏ, ఇరిగేషన్ శాఖల అధికారులతో కలిసి రామన్నకుంట చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని చెరువులను సుందరీకరించాలని తాను ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసినప్పుడు విన్నవించానని అన్నారు. ఈ మేరకు ఆయన ఆదేశాలతో యంత్రాంగం క్షేత్ర స్థాయి పరిశీలనకు వచ్చిందన్నారు. వీలైనంత త్వరగా రామన్నకుంట చెరువు సుందరీకరణ పనులపై నివేదిక రూపొందించి, పనులు జరిగేలా చూడాలన్నారు.

ఆస్పత్రి నిర్మాణంలో జాప్యం తగదు



అడ్డగుట్ట ఆరోగ్య కేంద్రం ముందు నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అడ్డగుట్ట: యాభై పడకల ఆస్పత్రికి గతంలో శంకుస్థాపన చేసిన స్థలంలోనే ఆస్పత్రిని నిర్మించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. అడ్డగుట్టలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జోన్ కార్యదర్శి అజయ్ బాబు మాట్లాడుతూ.. అడ్డగుట్టలో ఉన్న ఖాళీ స్థలంలో 50 పడకల ఆస్పత్రి నిర్మాణానికి 2006లో అప్పటి ఎమ్మెల్యే జయసుధ, మాజీ ఎంపీ అంజన్‌కుమార్, 2009లో ప్రస్తుత ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌లు శంకుస్థాపన చేశారన్నారు. అందులో 50 పడకల ఆస్పత్రి నిర్మాణం చేపట్టకపోగా, ప్రస్తుతం ఉన్నటువంటి ఆరోగ్య కేంద్రాన్ని కూల్చేసి దాని స్థానంలో 30 పడకల ఆస్పత్రి నిర్మించేందుకు సన్నద్ధం అవుతుండడం అధికారులు, ప్రజాప్రతినిధుల చేతగాని తనానికి నిదర్శనం అని పేర్కొన్నారు. అస్పత్రి నిర్మాణం విషయంలో జాప్యం చేయడం కారణంగా ప్రస్తుతం సదరు స్థలం కబ్జా కోరల్లోకి వెళ్లిందన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ స్పందించి గతంలో తాను శంకుస్థాపన చేసిన స్థలంలోనే యాభై పడకల ఆస్పత్రిని నిర్మించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ నిరసనలో సీపీఎం నాయకులు ఆర్. మల్లేష్, వెంకటస్వామి, అంజమ్మ, శారద తదితరులు పాల్గొన్నారు.

సీతాఫల్‌మండి బీజేపీ కార్యవర్గం ఎన్నిక



నియామకపత్రం అందుకుంటున్న ఈవీ నరేశ్

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ బీజేపీ పూర్తి కార్యవర్గాన్ని శనివారం మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షుడు భరత్‌గౌడ్ ప్రకటించారు. డివిజన్ అధ్యక్షుడిగా ఈవీ నరేశ్, ఉపాధ్యక్షులుగా సీహెచ్.వేణుగోపాలాచార్యులు, ఎస్.భాగ్యమ్మ, కేఎస్ నరహరి, ఎం.నాగేశ్వర్, ప్రధాన కార్యదర్శులుగా సీహెచ్ సురేశ్‌ముదిరాజ్, ఎం.ప్రభుదాస్, కార్యదర్శులుగా జీఆర్ దైవప్రసాద్, జీబీ హరి, ఎం.మహేశ్‌యాదవ్, పి.భారతి, కోశాధికారిగా పి.భారతిని నియమించినట్లు భరత్‌గౌడ్ తెలిపారు. వీరితోపాటు మరో 34 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, సికింద్రాబాద్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌ఛార్జి కందాడి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రకటించాలి



పోస్టర్ విడుదల చేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

సికింద్రాబాద్: ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతిపితగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని కొండాలక్ష్మణ్ బాపూజీ ఫౌండేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం వారాసీగూడలోని గ్రేటర్ పద్మాశాలి సంఘం కార్యాలయంలో కొండాలక్ష్మణ్ బాపూజీ ఫౌండేషన్ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొండాలక్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రకటించాలన్న పోస్టర్‌ను ఆవిష్కరించారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాలు పురస్కరించుకుని ట్యాంక్‌బండ్‌లోని బాపూజీ విగ్రహం వద్ద వేడుకలు నిర్వహించి జాతిపితగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని కోరారు. ఈ సమావేశంలో ఫౌండేషన్ ప్రతినిధులు బొమ్మ నరేంద్ర, బొమ్మ అశోక్, గోలి జనార్ధన్, శివ తదితరులు పాల్గొన్నారు.

కారుపై డీజిల్ పోసి భయపెట్టే ప్రయత్నం



కారుపై డీజిల్ పోస్తున్న దయాకర్‌యాదవ్

అడ్డగుట్ట: పాత కక్షలను మనసులో పెట్టుకొని ఓ వ్యక్తిని భయపెట్టేందుకు యత్నించిన ఘటన లాలాగూడ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. లాలాపేట ప్రాంతానికి చెందిన దయాకర్ యాదవ్(43)కు అదే ప్రాంతానికి చెందిన రాహుల్ అనే వ్యక్తితో పాత కక్షలు ఉన్నాయి. నాలుగు రోజుల క్రితం రాహుల్ తన కారులో బయటకు వెళ్తున్నాడు. మధ్యలో లాలాపేట హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద ఆగి డీజిల్ కొట్టించుకుంటున్నాడు. అదే సమయంలో అక్కడే ఉన్న దయాకర్ యాదవ్ డీజిల్ గన్‌ను తీసుకొని కారుపై పోసి వీరంగం సృష్టించాడు.దీంతో రాహుల్ స్థానిక లాలాగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు శనివారం రిమాండుకు తరలించారు.

అడుగడుగునా నిర్లక్ష్యం..!

థీమ్‌పార్కును పట్టించుకోని అధికారులు

- పాడైపోయిన పిల్లల ఆట సామగ్రి.
- పచ్చదనం కనుమరుగు..
- అపరిశుభ్రంగా షటిల్‌బ్యాడ్మింటన్ కోర్టు..
- పార్కులో ఎండుమిరపకాయలు ఎండబెట్టుకుంటున్న స్థానికులు



మూలన పడ్డ పిల్లలు ఆడుకునే జారుడుబల్లలు..



దెబ్బతిన్న ఫ్లోరింగ్ మ్యాట్..



సనత్‌నగర్: థీమ్ పార్కు అంటూ కోట్లు కుమ్మరించారు..నిర్వహణను మాత్రం గాలికొదిలేశారు. సనత్‌నగర్ నెహ్రూ పార్కును దాదాపు రెండున్నర కోట్ల వ్యయంతో గత మూడేళ్ల క్రితం వావ్..అనే రీతిలో థీమ్ పార్కుగా అభివృద్ధి చేశారు. కళ్లు జిగేల్‌మని పించేలా దీనిని తీర్చిదిద్దారు. థీమ్ పార్కు ప్రారంభోత్సవం కొద్ది రోజులు సందర్శకులు కొద్దిసేపు ఇక్కడి ఆహ్లాదకర వాతావరణంలో సేదదీరి వెళ్ళేందుకు ఎంతో ఆసక్తిని కనబరిచేవారు. ఇప్పుడు ఆ పార్కుకు వెళ్లాలంటే ఆనాసక్తి కనబరిచే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనికి కారణం పార్కు నిర్వహణను మరిచిపోవడంతో అభివృద్ధి చేసిన ఆనందం మూణ్ణాళ్ల ముచ్చటగానే మారింది.

అడుగడుగునా నిర్లక్ష్యమే..

పిల్లలు సరదాగా గడిపేందుకు వారి ఉల్లాసం కోసం స్లైడ్ (జారుడు బల్లలను) జోన్‌ను ఏర్పాటుచేశారు. అయితే అవి పూర్తిగా పాడైపోవడంతో పిల్లలు ఆడుకునేందుకు వీలు లేకుండాపోయాయి. మొత్తం ఆరు స్లైడ్స్‌ను ఏర్పాటుచేయగా అందులో నాలుగు విరిగిపోవడంతో మూలనపడ్డాయి. ఉన్న రెండు కూడా ప్రమాదకరంగా ఉన్నాయి. ఇక ఫ్లోరింగ్ అయితే మరీ అధ్వాన్నంగా మారింది. పిల్లలకు దెబ్బతగలకుండా ఉండేలా వేసిన మ్యాట్ ఫ్లోరింగ్ పూర్తిగా దెబ్బతిని అందవిహీనంగా తయారైంది. ఇక ఆ పక్కనే షటిల్ బ్యాడ్మింటన్ ఆడుకునేందుకు వీలుగా కోర్టును అందంగా తీర్చిదిద్దారు. కానీ అక్కడంతా చెత్తా చెదారం వ్యర్థాలతో పాటు వర్షపునీరు నిలిచి అపరిశుభ్రతకు చిరునామాగా మారింది.

పచ్చదనం కనుమరుగు..

ప్రారంభోత్సవం మొదట్లో పార్కు అంతా ఎక్కడ చూసినా పచ్చదనం కనువిందు చేస్తుండేది. ఇప్పుడు పచ్చదనం కనుమరుగైంది. ముఖ్యంగా పచ్చని లాన్‌లు కనుమరుగై వర్షం పడితే బురదమయంగా మారుతోంది. పచ్చని లాన్‌లో కూర్చొని సేదదీరుదామంటే బురదగా ఉండడంతో అటువైపు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఇక వాటర్ ఫౌంటెన్‌ను ఏర్పాటుచేసినా అది అలంకార ప్రాయంగానే మిగిలింది. పేరుకే ఫౌంటెన్ గానీ అది ఏనాడూ పనిచేసిన దఖలాలు లేవు. ఇక కొన్ని బెంచీలు ఒక వైపు కిందకు కుంగిపోయి కూర్చోవడానికి వీల్లేకుండా ఉన్నాయి. ఇక సాయంత్రమైతే లైట్లు వెలిగే పరిస్థితి లేదు. దీంతో వాకర్లు కూడా వేరే పార్కును చూసుకోవాల్సిన అవసరం అనివార్యమైంది.

పార్కులోనే వార్డు కార్యాలయం ఉన్నా..

నెహ్రూ పార్కులోనే ఒకవైపు జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయం కూడా కొనసాగుతుంది. ఇంజనీరింగ్, శానిటేషన్, రెవెన్యూ తదితర విభాగాల అధికారులు ఇక్కడకు వస్తుంటారు. సమస్యలు తీర్చే అధికారుల వార్డు కార్యాలయం ఈ పార్కులోనే ఉన్నా..అదే పార్కు సమస్యలు తీర్చేవారు కరువయ్యారు. అలాంటప్పుడు కనిపించని సమస్యలను ఏవిధంగా పరిష్కరిస్తారేనని అక్కడికి వచ్చే ప్రజలు వాపోతున్నారు. చివరకు ఈ పార్కు ఎలా తయారైందంటే ఎండుమిరపకాయలు ఎండపెట్టుకోవడానికి అడ్డాగా మారిపోయిందంటే ఈ పార్కుపై అధికారుల అలసత్వం ఏవిధంగా ఉందో అర్థమవుతుంది.





అలంకారప్రాయంగా వాటర్ ఫౌంటెన్. మిర్చిని ఎండబెట్టుకున్న స్థానికులు..